క్లుప్తంగా

సబ్‌కలెక్టర్‌ను కలిసిన ఆర్టీఓ



సబ్‌కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఆర్టీఓ నాగేంద్ర, సిబ్బంది

ఆదోనిరూరల్: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదోని డివిజన్ నూతన సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మని ఆదోని ఆర్టీఓ నాగేంద్ర, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిసిరాదీప్తి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్టీఓ పరిధిలోని సమస్యలను సత్వరమే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్ వారికి సూచించారు.

మంగరాయస్వామికి ధాన్య పూజ



నవధాన్యాలు, కూరగాయలతో ఆంజనేయస్వామికి పూజలు చేసిన దృశ్యం

ఆదోనిఅర్బన్: పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమద్ వ్రతం, మహోత్సవం వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి ధాన్య పూజలు జరిగాయి. ప్రారంభోత్సవం సందర్భంగా ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు చేసి జెండాను ఆవిష్కరించారు. అనంతరం భక్తులు నవధాన్యాలతో స్వామి వారిని పూజించారు.

ఘనంగా మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఆర్లబండ మఠం పీఠాధిపతి మర్రిస్వామి, గ్రామస్తులు

కోసిగి: మండలంలోని అగసనూరు గ్రామంలో కొత్తగా నిర్మించిన ఆలయంలో గ్రామ దేవత మారెమ్మ దేవి నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వేకువ జామున నుంచి ఆలయంలో తుంగభద్ర నదీ జలాలను తీసుకొచ్చి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆర్లబండ అంబా భవాని ఆలయ పీఠాధిపతి మర్రిస్వామి ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిపించారు. గ్రామ ప్రజలు నారికేలలు, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. సర్పంచ్ వడ్డే ఉలిగయ్య, మాజీ సర్పంచ్ ఆకాశ్ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీమఠంలో బిగ్‌బాస్ రన్నర్ అమర్‌దీప్



మంత్రాలయం : శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం బుల్లి తెర నటుడు, బిగ్‌బాస్ రన్నర్ అమర్‌దీప్ సతీసమేతంగా శుక్రవారం మంత్రాలయం విచ్చేశారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్ర స్వామి బృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



ఆదోనిరూరల్: మండలంలోని కపటి గ్రామంలోని సర్వే నంబర్ 175లో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు శుక్రవారం ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మృతురాలి ఆరెంజ్ కలర్ జాకెట్, ఆకుపచ్చ చీర, చీర అంచులు ఆరెంజ్ కలర్‌లో ఉన్నాయన్నారు. ఎరుపురంగు చెప్పులు వేసుకుందని, ముక్కు కుడివైపున బంగారు ముక్కు రాయి, నుదుటిపై పచ్చబొట్టు, రెండు చెవులకు బంగారు కమ్మలు, ఆమె గొంతులో వెండి జంజివారం, రెండు వరసలతో ఉన్న సిల్వర్ తాయత్తు కూడా ఉందని, రెండు చేతులకు మట్టి గాజులు ఉన్నాయన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. వివరాలు తెలిసిన వారు ఆదోని రూరల్ సీఐ 9121101138 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బాలిక అదృశ్యం

కోసిగి: మండలంలోని వందగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఓ బాలిక గురువారం అర్ధరాత్రి కనిపించకుండా పోయిందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతూ కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అర్ధరాత్రి నుంచి కనిపించక పోవడంతో బంధువులతో కలిసి రాత్రి చుట్టు పక్కల గాలించామన్నారు. అయినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. పాఠశాల పీఈటీ మాస్టర్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ ఆయనను పోలీసులకు అప్పగించారు.

రూపుదిద్దుకుంటున్న సొంతిళ్లు

- జోరుగా ఇళ్ల నిర్మాణాలు
- వేగంగా సాగుతున్న సౌకర్యాల కల్పన పనులు
- పట్టణంలో 17.81 ఎకరాల్లో 3లే అవుట్లు
- మొదటి విడతగా 6,495 ఇళ్లు మంజూరు
- వీటికి రూ.73.61కోట్ల కేటాయింపు
- మంచినీటి వసతికి రూ.7.69 కోట్లు వెచ్చింపు
- అంతర్గత రహదారులకు రూ.11.93 కోట్ల ఖర్చు
- రూ.2 కోట్లతో 11/33 కేవీ సబ్ స్టేషన్



టాప్ దశ పూర్తి చేసుకున్న ఇళ్లు, విద్యుత్ స్తంభాలు పాతిన దృశ్యం

ఆదోని సెంట్రల్: పేదల సొంతింటి కలను నేర్చడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పట్టణ సమీపంలోని జగనన్న కాలనీలో ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. అలాగే ఆయా కాలనీల్లో వసతుల కల్పన పనులు సైతం జోరందుకున్నాయి. పట్టణంలోని జగనన్న కాలనీలోని 3 లే అవుట్లలో 17.81 ఎకరాలలో ఏర్పాటు చేయగా.. 9,327 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. మొదటి విడతలో 6,495 ఇళ్లు మంజూరయ్యాయి. ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ.73.61 కోట్లు కేటాయించింది. వాటిలో 1,321 ఇళ్లు టాప్ వేయగా, 825 ఇళ్లు రూఫ్ లెవల్‌లో, 584 ఇళ్లు లింటల్ లెవల్ ఉన్నాయి. 2,928 బేస్ మట్టం స్థాయి, 837 ఇళ్లు పిల్లర్స్, ప్లింత్‌బీమ్ కాలమ్స్‌లో వంటి దశలో నిర్మాణంలో ఉన్నాయి. ఇళ్ల నిర్మాణ పనులను థర్డ్ పార్టీ వారు చేపడుతున్నారు. లబ్ధిదారులకు ఇబ్బందులు కలగ కూడదని ప్రభుత్వం ముందస్తుగా సౌకర్యాల కల్పనకు పూనుకుంది. కాలనీలో పార్కు, దేవాలయం, బడి వంటివి ఏర్పాటు చేసేందుకు స్థలాలను సైతం కేటాయించారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతవరణంతో పాటు తాగునీరు, రోడ్లు, విద్యుత్ వంటి సౌకర్యాలను కల్పించే పనులను చేపడుతున్నారు.

సౌకర్యాలు ఇలా..

జగనన్న కాలనీల్లో అన్ని సౌకర్యాలను కల్పించాలని ప్రభుత్వ నిర్ణయించింది. ఈ మేరకు నిధులు విడుదల చేయడంతో పనులు వేగంగా జరుగుతున్నాయి. విద్యుత్, తాగునీరు, అంతర్గత రోడ్లు తదితర పనులు చేస్తున్నారు.

- తాగునీటి వసతి ఏర్పాటు కోసం రూ.7.69 కోట్లు ఖర్చు చేస్తున్నారు.
- ఇప్పటికే కాలనీలో పైపులైన్లు వేసి మినీ ట్యాంకులను ఏర్పాటు చేశారు.



కొనసాగుతున్న నిర్మాణ పనులు

- కాలనీలో అంతర్గత రహదారుల నిర్మాణం కోసం రూ.11.93 కోట్లు ఖర్చు చేస్తున్నారు.
- విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం రూ.2 కోట్లతో 11/33 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టింది.
- కాలనీలో విద్యుత్తు స్థంబాలను ఏర్పాటు చేసి విద్యుత్తు సౌకర్యం కల్పిస్తున్నారు.
- ప్రతి వీధికి ఒక మినీ 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నారు.
- కాలనీలో విద్యుత్ అంతరాయం తలెత్తకుండా ఉండేలా పనులు చేస్తున్నారు.

సొంత ఇల్లు వచ్చినందుకు సంతోషంగా ఉంది



మాకు ఇప్పటి వరకు ఎలాంటి స్థలం లేదు. జగనన్న కాలనీలో నా భార్య సయీద్ భాను పేరు మీద ఇల్లు మంజూరు చేసినందుకు సంతోషంగా ఉంది. ఇల్లు, స్థలం కావాలనీ మేం ఎవరి దగ్గరకీ వెళ్లలేదు. వలంటీర్ మా దగ్గరకు వచ్చి వార్డు సచివాలయంలో దరఖాస్తు చేయించింది. ప్రభుత్వం మాకు స్థలం ఇచ్చి ఇంటిని కట్టిస్తుంది. ఇంటిని కట్టుకునే స్తోమత లేని మాలాంటి వారికి ప్రభుత్వమే థర్డ్ పార్టీతో నిర్మించి ఇవ్వడం మంచి నిర్ణయం. ప్రస్తుతం మా ఇల్లు లింటల్ దశలో పనులు జరుగుతున్నాయి. త్వరలో అందజేస్తామని అధికారులు తెలిపారు.

– నజీర్ బాషా, ఆదోని

ఇళ్ల నిర్మాణాల పనుల్లో జాప్యం వద్దు



ఇళ్ల నిర్మాణ పనులలో జాప్యం చేయకుండా త్వరగా పనులను చేపట్టాలని థర్డ్ పార్టీ ఏజెన్సీకి సూచించాం. ఇప్పటికే దాదాపు మనకు మంజూరైన ఇళ్లను గుర్తించి వాటి పనులు చేపడుతున్నాం. కాలనీలో తాగునీటితో పాటు అంతర్గత రహదారుల పనులను కూడా చేస్తున్నారు. మరో పక్క విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నారు. భవిషత్‌లో లబ్దిదారులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పిస్తుంది. జనవరి చివరి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. లేబర్ సమస్య ఉంది. అయినా పనులు ఆగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎం.రవికుమార్, హౌసింగ్ డీఈ

నిర్మాణంలో ఉంది..



నేను, నా భర్త కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నాం. మాకు ముగ్గురు పిల్లలు. మా అత్త వాళ్లది ఉమ్మడి కుటుంబం. అందరూ కలిసే ఉంటున్నాం. అయితే మాకు ఇల్లు లేదు. జగనన్న కాలనీలో స్థలం ఇచ్చి ప్రభుత్వమే ఇల్లు కట్టి ఇవ్వడం మాకు సంతోషంగా ఉంది. ఇల్లు కట్టుకోలేని మాలాంటి వాళ్లకు కట్టించి ఇవ్వాలనుకోవడం మంచి నిర్ణయం. నిర్మాణం పూర్తయితే సొంతింట్లో ఉంటాం.

– మాదేవి, ఆదోని



మినీ ట్యాంకు ఏర్పాటు చేసిన దృశ్యం



విద్యుత్తు సమస్య తలెత్తకుండా మినీట్రాన్స్‌ఫార్మర్



11/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్

తప్పులు లేని ఓటర్ జాబితాను తయారు చేస్తున్నాం



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోనిరూరల్: తప్పులు లేని ఓటర్ జాబితాను తయారు చేస్తున్నామని సబ్‌కలెక్టర్ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. ఆదోని నియోజకవర్గ ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ వరకు ఫారం 6, 7, 8కు దరఖాస్తు చేసుకున్న ఫారాలను ఈనెలలోపు పెండింగ్‌లో ఉన్న వాటిని పూర్తి చేస్తామన్నారు. ఆదోని నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వాటిలో 24 కేంద్రాలను ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా లేనందున బదిలీ చేశామని చెప్పారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని, రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఇజాజ్‌అమ్మద్, డీఎల్‌పీఓ కార్యాలయ పరిపాలనాధికారి వీరభద్రప్ప, ఎంపీడీఓ కార్యాలయ పరిపాలనాధికారి విజయశేఖరరావు పాల్గొన్నారు.

ఆ మొత్తం రికవరీ చేయండి



పెద్దకడబూరులో మాట్లాడుతున్న పీడీ అమర్నాథ్‌రెడ్డి

పెద్దకడబూరు :ఉపాధి హామీ పథకంలో భాగంగా 2022 – 23లో జరిగిన పనుల్లో దారి మళ్లిన రూ.3,98,185 మొత్తాన్ని రికవరీ చేయాలని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ అమర్నాథ్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఎంపీడీఓ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మండలంలో జరిగిన 820 పనులకు గానూ రూ. 7,65,41,186 ఖర్చు చేసినట్లు వివరించారు. దీనికి సంబంధించి వారం రోజులుగా మండలంలో సామాజిక తనిఖీ చేపట్టగా జరిగిన అవినీతిని పంచాయతీల వారీగా చదవి వినిపించారు. బసలదొడ్డిలో రూ.1867, చిన్న తుంబళంలో రూ.1,21,816, దొడ్డిమేకలలో రూ.632, హెచ్.మురవణిలో రూ.1,65,898, హనుమాపురంలో రూ.1,706, జాలవాడిలో రూ.272, కల్లుకుంటలో రూ.2,777, కంబదహాల్‌లో రూ.3,721, కంబలదిన్నెలో రూ. 1,234, ముచ్చగిరిలో రూ.2,448, మేకడోణలో రూ.794, పీకలబెట్టలో 21,447, తారాపురంలో రూ.1,423 తో పాటు మరికొన్ని గ్రామాల్లో రికవరీకి ఆదేశించారు. త్వరితగతిన రికవరీ పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ మాధవీలత, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ భాస్కర్, ఆదినారాయణ, ఏపీడీ లోకేశ్వర్, సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ తిరుమలేష్, సిబ్బంది, పంచాయతీరాజ్ ఏఈ మల్లయ్య, హౌసింగ్ ఏఈ వేణుగోపాల్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



బాలికల జూనియర్ కళాశాలలో రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాశాల సిబ్బంది



రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పురపాలక పాఠశాల ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: పట్టణంలో జాతీయ గణిత దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు.ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సంజన్న, సిబ్బంది విద్యార్థులతో కలసి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ శీన్నివాసన్ బాల్యం, విద్యాభ్యాసం, గణిత శాస్త్రంలో ఆయన చేసిన కృషిని కొనియాడారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గోవిందరాజులు, అధ్యాపకులు శివయ్య, కాంతమ్మ, ఈరన్న, శాంతి స్వరూప్,రంగన్న తెలుగు బాబు, బడేసాహెబ్, రాజేశ్వరి పాల్గొన్నారు.

- ఆర్‌ఆర్ లేబర్ కాలనీలోని పురపాలక ఉన్నత పాఠశాలలో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు రమేష్ నాయుడు మాట్లాడుతూ రామానుజన్ గణితంలో ఆయన సాధించిన విజయాలను విద్యార్థులకు వివరించారు.
- ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో గణిత అధ్యాపకులు సిబ్బందితో కలసి గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అధ్యాపకులు రఫీక్, రజాక్, తిమోతి, బాలరాజు, రమేష్, చిన్న వెంకటేశ్వర్లు, సంతోష్ పాల్గొన్నారు.



ఆర్ట్స్ కళాశాలలో..

- సెయింట్ ఆంథోని పాఠశాలలో కరస్పాండెంట్ ఫాదర్ జాన్ డెవిడ్ పాఠశాల సిబ్బందితో కలసి శ్రీనివాస్ రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆదోనివాసికి పురస్కారం



అవార్డు అందుకుంటున్న విరుపాక్షిస్వామి

ఆదోనిఅర్బన్: పెనుగొండ దర్గా సందల్ మహల్‌లో పీఠాధిపతి సజ్జాద్ ఏ నషీన్‌తాజ్ బాబా ఆధ్వర్యంలో ఆల్ ఇండియా టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ వారు ఉత్తమ సామాజికసేవా పురస్కారాన్ని ఆదోనివాసికి అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ సామాజిక సేవకులకు శుక్రవారం పెనుగొండలోని దర్గా పీఠాధిపతి ఆధ్వర్యంలో పురస్కారాలను అందజేశారు. పట్టణానికి చెందిన జనసేవా సామాజిక సంస్థ కార్యదర్శి విరుపాక్షిస్వామి, జనవిజ్ఞాన వేదిక డాక్టర్ హరిప్రసాద్‌యాదవ్‌కు దర్గా పీఠాధిపతి సజ్జాద్ నషీన్‌తాజ్‌బాబా, ఆల్ ఇండియా టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్‌ఫారూక్‌ఖాన్, సత్యసాయి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా, పెనుగొండ డీఎస్పీ హుసేన్‌పీరా పురస్కారం అందజేశారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న శ్రీ శివయోగానంద స్వామిజీ

కోసిగి: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవరుచుకోవాలని కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా కరేకల్లు శ్రీ సచ్చిదానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శివయోగానంద స్వామిజీ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక గీతమందిరం ఆశ్రమంలో భగవద్గీత జయంతిని పురస్కరించుకుని విద్యార్థిని విద్యార్థులకు భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలలో చదువుతున్న 160 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వెంకటరెడ్డి, ముకుంద కృష్ణమూర్తి, రామన్న, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి, పోటీల నిర్వాహకులు కృష్ణమూర్తి, శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు.



విద్యుత్ దీపాలంకరణలో తిరుమలనగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం



దర్శనానికి క్యూలైన్‌ల కోసం బారికేడ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

నేడు ముక్కోటి ఏకాదశి

- ముస్తాబయిన ఆలయాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

ఆదోనిఅర్బన్: శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలతో అలంకరించి, ఉత్తరద్వార దర్శనానికి క్యూలైన్ల కోసం బారికేడ్లను ఏర్పాటు చేశారు. తిరుమలనగర్‌లోని శ్రీ పద్మావతి, వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. కోటనగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని బారికేడ్లు ఏర్పాటు చేశారు. వేకువజాము నుంచి స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, తులసీహారం, ప్రత్యేకంగా పూల అలంకరణ చేసి ఉత్తర ముఖద్వారం ద్వారా దర్శించుకునేలా నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.



వేంకటేశ్వరస్వామిని ఆభరణాలతో ముస్తాబు చేసిన దృశ్యం

దశాబ్దాల రోడ్డు సమస్యకు పరిష్కారం

- రూ.4కోట్లతో ఎరిగేరి – ఉరుకుంద రోడ్డు పనులు పూర్తి
- ప్రయాణికులు, భక్తులకు తప్పిన అవస్థలు





నాడు: ఎరిగేరి నుంచి ఉరుకుంద వరకు ఉన్న రోడ్డు, నేడు: బీటీ రోడ్డు వేసిన దృశ్యం

కౌతాళం: దశబ్దకాలం నుంచి ఎదురు చూస్తున్న రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో ప్రయాణికులు, భక్తులు ఆయా గ్రామాల ప్రజల కల నేరవేరింది. మండలంలోని ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనానికి ఆదోని వైపు నుంచి భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. అయితే ఎరిగేరి గ్రామం నుంచి ఉరుకుంద వరకు రోడ్డు అధ్వానంగా మారింది. భక్తులతో పాటు ఈ రోడ్డు గుండా పోయే గ్రామాల ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. సమస్య పరిష్కరించాలని గత ప్రభుత్వం హయాంలో ప్రజలు విన్నవించినా ఫలితం లేకపోయింది. దీంతో సమస్య కొనసాగింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం స్పందించి ఎరిగేరి నుంచి వయా ఉరుకుంద చిరుతపల్లి క్రాస్ వరకు 9.8 కి.మీ. రోడ్డును రూ.4 కోట్లతో నిర్మాణం పూర్తి చేసిది. దీంతో ప్రజలు, భక్తుల కల నెరవేరింది. ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి వెళ్లే భక్తులతో పాటు హాల్వి, చిరుతపల్లి, మల్లనహాట్టి, చూడి, గోతులదొడ్డి, గుడికంబాలి వివిధ గ్రామాల ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి వరకు ఈ రోడ్డు గుండా ప్రయాణం సాగించడానికి జంకిన జనం నేడు.. రయ్ మంటూ దూసుకెళ్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోసిగి: మండలంలోని వ్యవసాయానికి శనివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంకాలం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వీరేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 132 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు పనులు చేయిస్తున్నందున కేవలం సింగిల్ ఫేస్ మాత్రమే ఉంటుందని, త్రీఫేస్ సరఫరా ఉండదన్నారు. రైతులు సహకరించాలని కోరారు.

జయప్రదం చేయండి

కౌతాళం: రాష్ట్రంలోని కురువలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈనెల 24వ తేదీన ఆలూరులో చేపడుతున్న కురవ సింహగర్జనకు మండలంలోని కురువ కులస్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని కురువ సంఘం మండల అధ్యక్షుడు వీరేష్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో కురువ కులస్తులు రాణించినప్పుడే ఆర్థిక, రాజకీయంగా ఎదుగుతామన్నారు. సమావేశానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకకు చెందిన కురువ మేధావులు, రాజకీయ ప్రముఖులు హాజరువుతారని తెలిపారు.

ప్రజా సమస్యలు పట్టని టీడీపీ



పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదోనిటౌన్: టీడీపీ పాలనలతో ప్రజా సమస్యలను పరిష్కరించకుండా గాలికొదిలేశారని, కేవలం పార్టీ నాయకులు, కార్యకర్తల మేలుకోసమే ఆరాటపడ్డాడని మున్సిపల్ చైర్మన్ బోయ శాంత, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, జేసీఎస్ కన్వీనర్ ఫయాజ్‌అహ్మద్ విమర్శించారు. జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తూ ప్రభుత్వ పథకాలన్నీ ఆ పార్టీ అనుచరులు, కార్యకర్తలకే దక్కాయన్నారు. శుక్రవారం పట్టణంలోని 40వ వార్డులోని హనుమాన్‌నగర్‌లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం చేపట్టారు. కౌన్సిలర్ బిందు, వార్డు ఇన్‌చార్జి దుర్గప్ప, నాయకులు తాయన్న, అబుబక్కర్, వెంకటేష్, ఆటోబాషా, రంగస్వామి, తుకారామ్, బ్రహ్మీ, చంద్ర, గోపీనాథ్ పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలు చెల్లించాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

కౌతాళం: ప్రతి నెల 1వ తేదీనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు అందేలా చూడాలని, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలు చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా సహధ్యక్షురాలు జీవిత, జిల్లా కార్యదర్శి గాదిలింగ కో రారు. శుక్రవారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి వినతి పత్రం అందజేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు బస ప్ప, నారాయణ, రాజ్‌కుమార్, బాలాజీరావు ఉన్నారు.

పీవీ రావు వర్ధంతి

ఆదోనిరూరల్: పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో మాలమహానాడు వ్యవస్థాపకుడు పి.వి.రావు 18వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాల మహానాడు నాయకులు, రాష్ట్ర అధ్యక్షుడు కల్లపోతుల సురేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ వై.పి.కృష్ణమోహన్ పి.వి.రావు సేవలను కొనియాడారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆంజనేయులు, రాష్ట్ర అడ్వెంచర్ కేశవ మాస్టర్, పట్టణాధ్యక్షుడు బొబ్బిలి, ఆదోని మండలాధ్యక్షుడు దాసరి నరేష్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కల్లపోతుల సురేష్